వాషింగ్టన్‌లో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు, ఎన్నారైలు

తెలంగాణ ఉద్యమంలో
ఎన్నారైల పాత్ర మరువలేనిది

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల, జూన్ 8: తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రవాస భారతీయులు కీలక భూమిక పోషించడమేగాక బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పోరాటానికి ఊతం అందించారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. అమెరికాలోని వాషింగ్టన్ తెలంగాణ ఆసోసియేషన్(డబ్ల్యూటీజీ) ఆధ్వర్యంలో వాషింగ్టన్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలు, తెలంగాణ ఆవర్భావ దినోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎర్రబెల్లి హాజరయ్యారు. ప్రారంభ వేడుకల్లో తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జరిగిన వేడుకల్లో ఎర్రబెల్లి మాట్లాడుతూ ఉద్యమ సమయంలో తెలంగాణ సంస్కృతికి ప్రతీకైన బతుకమ్మ, బోనాల విశిష్టతను ఎన్ఆర్ఐలు చాటిచెప్పారని అన్నారు. మరోవైపు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అన్ని దేశాల్లో ఉద్యమాలు నిర్వహించి స్ఫూర్తి నింపారని తెలిపారు. ఉద్యమంలో కేసీఆర్‌కు అండగా నిలిచిన ఎన్నారైల కృషి మరువలేనిదన్నారు. మెజారిటీ పక్షం బీఆర్ఎస్ పక్షాన నిలిచి విదేశాల్లో గులాబీ జెండాలను ఎగురవేసిన ఘనత మీదన్నారు. నేడు తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా అడుగడుగునా కేసీఆర్ అభివృద్ధి ఆనవాళ్లు కనిపిస్తాయన్నారు. ఇటీవల జరిగిన ప్రపంచ అందాల పోటీల్లో తెలంగాణ ప్రభుత్వం విదేశాల నుంచి వచ్చిన మహిళలను పర్యాటక ప్రదేశాలకు పంపిందన్నారు. వారు పలు ప్రాంతాలను సందర్శించగా అవన్నీ కేసీఆర్ అభివృద్ధి చేసిన అనవాళ్లు కావడం విశేషమన్నారు. హైదరాబాద్‌లో రాష్ట్ర సచివాలయం, పోలీస్ కమాండ్ కంట్రోల్ రూం, యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి ఆలయ అభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యమైందన్నారు. అనంతరం అతిథులను వాషింగ్టన్ తెలంగాణ అసోసియేషన్ ఘనంగా సన్మానించింది. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మృతికి సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎల్ రమణ, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తె మట్టెలు అందిస్తున్న వాస్విక్ ఫౌండేషన్ సభ్యులు

పేదింటి బిడ్డల వివాహాలకు పుస్తెమట్టెలు అందజేత

బచ్చన్నపేట, జూన్ 8: మండల కేంద్రంతోపాటు, పడమటికేశవాపూర్‌లో పేదింటి ఆడబిడ్డల వివాహాలకు వాస్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుస్తెమట్టెలు అందించి చేయూతనిచ్చారు. వాస్విక్ ఫౌండేషన్ చైర్మన్ నిడిగొండ నరేశ్, వైస్ చైర్మన్ నూకల భాస్కర్‌రెడ్డి పేదింటి ఆడబిడ్డల వివాహాలకు పుస్తెమట్టెలు అందిస్తున్నారని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. పడమటికేశవాపూర్‌లో గండు కనకయ్య కూతురు రిచా వివాహం, బచ్చన్నపేటలో బోమెల్ల లక్ష్మీ కుమార్తె భవానీ వివాహం జరిగాయి. ఆయా కుటుంబాలకు ఆదివారం ఫౌండేషన్ కార్యవర్గ సభ్యులు ఆముదాల భూపాల్‌రెడ్డి, శివరాత్రి మహేశ్, నరూకల బాల్‌రెడ్డి పుస్తెమట్టెలను ఆయా కుటుంబాలకు అందించారు. అనంతరం ఫౌండేషన్ నిర్వాహకులకు ఆయా కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపాయి. ఈ కార్యక్రమాల్లో రాజుపేట గోపాల్, గర్నెపల్లి వేణు, ఎర్రోళ్ల మహేశ్, పరమేశ్వర్, నవీన్, చందు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

లింగాలఘనపురం, జూన్ 8: జనగామ-సూర్యాపేట రహదారిపై వనపర్తి-వడ్డిచర్ల మధ్య ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని నేలపోగులకు చెందిన మందుగులోజు వినయ్‌కుమార్(27) మృతి చెందాడు. ఎస్సై శ్రవణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం .. దేవరుప్పుల మండలం సింగరాజుపల్లిలో వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్న వినయ్‌కుమార్ ఆదివారం బైక్‌పై జనగామకు వెళ్తుండగా వడ్డిచర్ల సమీపంలో జనగామ నుంచి అతివేగంగా వస్తున్న డీసీఎం ఢీకొంది. ఈ ఘటనలో వినయ్‌కుమార్ అక్కడిక్కడే మృతి చెందాడు. కాగా వినయ్ కుమార్‌కు ఇటీవలే వివాహం అయింది కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★ఎలాంటి విద్యార్హత లేకున్నా ఫర్వాలేదు. మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883.

NT-325336

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

బైక్‌పై నుంచి పడి ఒకరు..

కొడకండ్ల, జూన్ 8 : బైక్‌పై నుంచి పడి ఒకరు మృతి చెందిన ఘటన మండలలోని నర్సింగాపురం శివారులో ఆదివారం జరిగింది. ఎస్సై చింత రాజు తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్ ఘనపూర్ మండలం కోమటిగూడెం గ్రామానికి చెందిన చిక్కుడు కుమార్ బైక్‌పై పాలకుర్తి మీదుగా కొడకండ్లకు వెళ్తున్నాడు. నర్సింగాపురం రైస్ మిల్లు వద్ద అదుపు తప్పి బైక్ పై నుంచి పడిపోవడంతో కుమార్ అక్కడికక్కడే మృతి చెందారని ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రకృతి వనాలపై పర్యవేక్షణ కరువు

- పశువులకు ఆవాసంగా పచ్చని చెట్లు
- కాలుష్యం కోరల్లో జనగామ పట్టణ ప్రజలు

జనగామ పట్టణంలోని ప్రకృతి వనంలో పశువులు

జనగామ చౌరస్తా, జూన్ 8 : పల్లెలు, పట్టణ ప్రాంతాల ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు గత బీఆర్ఎస్ పాలనలో ఏర్పాటు చేసిన పకృతివనాలు నేడు పశువులకు ఆవాసంగా మారాయి. 'తెలంగాణకు హరితహారం' పేరిట కోట్లాది రూపాయలతో జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లో పచ్చటి 'ప్రకృతి వనాల'ను ఏర్పాటు చేశారు. యువత క్రీడల్లో రాణించేందుకు క్రీడా ప్రాంగణాలకు శ్రీకారం చుట్టారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వీటిని పట్టించుకోవడం లేదు. దీంతో ప్రకృతి వనాల్లో పశువులు ఆవాసం చేస్తుంటే, కాలుష్యం కోరల్లో ప్రజలు నివాసముంటున్నారు. ఇందుకు నిదర్శనంగానే జనగామ పట్టణంలోని 2వ వార్డు పరిధిలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ 'పట్టణ ప్రకృతి వనం'తో పాటు దాని పక్కనే ఆనుకొని ఉన్న 'క్రీడా ప్రాంగణం' సజీవ సాక్ష్యంగా దర్శనమిస్తున్నాయి. వివిధ రకాల పూలు, పండ్లు, నీడనిచ్చే చెట్లతో సుగంధ పరిమళాలు వెదజల్లాల్సిన ప్రకృతి వనా ల్లో పశువులకు నిలయంగా మారాయి. ఇవి డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. పచ్చటి చెట్ల నడుమ మనుషులు సేద తీరాల్సిన చోట పశువులు, పందులు ఆవాసం చేస్తుంటే, చుట్టుపక్కల ప్రజలు మాత్రం అక్కడ పేరుకున్న చెత్త చెదారంతో కాలుష్యం కోరల్లో ఇబ్బందులు పడుతున్నారు. జనగామ పట్టణంలోని 30 వార్డుల్లో ఉన్న పలు ప్రకృతి వనాలతో పాటు క్రీడా ప్రాంగణాల దుస్థితి ఇదే విధంగా ఉంది. సంబంధిత మున్సిపల్ అధికారులు పట్టణ ప్రకృ తి వనాలు, క్రీడా ప్రాంగణాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం..

ప్రస్తుతం వర్షాకాలం మొదలవడంతో పశువులకు ఆవాసంగా మారిన ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు దుర్గంధంగా మారాయి. దీంతో పట్టణంలో మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, కలరా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. వీటి నివారణకు పట్టణంలో పారిశుధ్య పనులు చేపట్టేందుకు మున్సిపల్ సిబ్బందితో స్పెషల్ డ్రైవ్ చేపట్టాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొన్నారు. మురికి ప్రాంతాల్లో దోమలు వ్యాపించకుండా ఆయిల్ బాల్స్ వేయడంతో పాటు ఫాగింగ్ చేయడం, తాగునీరు క్లోరినేషన్ చేయడం వంటి పనులు పకడ్బందీగా చేపట్టాలని కోరుతున్నారు.

ప్రకృతి వనాలను వినియోగంలోకి తేవాలి

జనగామ పట్టణంలోని ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు పశువులకు, పందులకు ఆవాసంగా మారాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు, యువతీ యువకులు ఆటల్లో మెళకువలు నేర్చుకోవడానికి లక్షలాది రూపాయల నిధులను ఖర్చు చేసి ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఇవి డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. సంబంధిత మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించి వాటిని ప్రజలకు ఉపయోగపడే విధంగా వినియోగంలోకి తీసుకురావాలి. అదేవిధంగా పట్టణ ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుం. **-జోగు ప్రకాశ్, సీపీఎం పట్టణ కార్యదర్శి, జనగామ**

ముస్లింలను మోసం చేసిన కాంగ్రెస్

ఖిలావరంగల్, జూన్ 8: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీలో ఉన్న ముస్లిం నాయకులు సిగ్గుతో తలదించుకోవాల్సిన పరిస్థితి దాపురించిందనని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సయ్యద్ మసూద్ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా మంత్రి వర్గంలో ఏ ఒక్క ముస్లింకు అవకాశం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి ముస్లింలను కేవలం ఓటు బ్యాంకుగానే చూశారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర జనాభాలో కీలకంగా ఉన్న ముస్లింలకు ఒక్క పదవీ ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. కేసీఆర్ హయాంలో రెవెన్యూ శాఖ మంత్రిగా, హోంశాఖ మంత్రిగా, డిప్యూటీ సీఎంగా ముస్లింకు అవకాశం కల్పించారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ముస్లింలకు ఇచ్చిన హామీలను నాడు కేసీఆర్ నిలబెట్టుకుంటే.. నేడు సీఎం రేవంత్‌రెడ్డి మంత్రి పదవి ఇవ్వకుండా ముస్లిం వర్గాన్ని కించపరిచారని విమర్శించారు.

సీపీఐ నేతృత్వంలో డబుల్‌బెడ్రూం ఇళ్ల ప్రవేశం

అధికారులు పంపిణీ చేయలేదని పేదలతో స్వాధీనం

డబుల్ బెడ్‌రూం ఇండ్ల వద్ద మాట్లాడుతున్న యాదగిరి

రఘునాథపల్లి, జూన్ 8 : డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మించినా నేటికీ లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడంతో సీపీఐ నాయకులు వాటిని పేదలతో ప్రవేశింపచేసిన ఘటన మండలంలోని కంచనపల్లిలో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కంచనపల్లిలో 30 డబుల్‌బెడ్‌రూం ఇళ్లను నిర్మించారు. వాటిని నేటికీ పంపిణీ చేయకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కావటి యాదగిరి, ఎమ్మార్పీఎస్ నాయకుల సహకారంతో అర్హులైన పేదలకు ఇళ్లను పంపిణీ చేయాలని కోరు తూ గత నెల 30న తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల ముందు దర్నా నిర్వహించారు. అయినా నేటికీ అధికారులు స్పందించకపోవడంతో ఆదివారం పేదలతో కలిసి డబుల్‌బెడ్‌రూం ఇళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇళ్లకు విద్యుత్ అందించడంతోపాటు తాగునీటి సౌకర్యం కల్పించాలని సీపీఐ నాయకుడు కావటి యాదగిరి కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి కందుకూరి మల్లేశం, నాయకులు పసుల దానియేలు, దొంగల వెంకయ్య, దైద దానీయేలు, గొంగళ్ల క స్తూరి, గుండె మహేందర్, చుంచు సురేందర్, గడ్డం సందీప్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

మాట్లాడుతున్న షేక్ రిజ్వాన్ బాషా

జనగామ చౌరస్తా, జూన్ 8 : జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా పూర్తయినట్లు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయంపై ఆధారపడి జీవించే రైతన్నలకు అండగా ఉండాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా జిల్లా యంత్రాంగం పనిచేసిందని పేర్కొన్నారు. గత ఏప్రిల్ 1వ తేదీన సన్న రకం ధాన్యం కొనుగోలు కోసం 107 కొనుగోలు కేంద్రాలు, దొడ్డు రకం ధాన్యం కొనుగోలు కోసం 193 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తంగా 300 కొనుగోలు కేంద్రాల ద్వారా 1,64,211.160 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. దీనిద్వారా రూ.380 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద అధికారులను ఇన్‌చార్జిలుగా నియమించినట్లు తెలిపారు. అవసరమైన గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, మాశ్చర్ మిషన్లు, ప్యాడీ క్లీనర్లతో పాటు ఇతర మౌలిక వసతులు కల్పించినట్లు పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు పూర్తయిన తర్వాత వాటిని మిల్లులకు తరలించడానికి రవాణా కోసం అవసరమైన లారీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులకు కనీస మద్దతు ధర కల్పిస్తూ ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

రేపు జనగామలో రఘుపాల్ సంస్మరణ సభ

జనగామ చౌరస్తా, జూన్ 8 : సీపీఎం సీనియర్ నాయకుడు, దివంగత గంగసాని రఘుపాల్ సంస్మరణ సభను మంగళవారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని కామాక్షి వేడుకల మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం నైజాం రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన యోధులు రఘునాథపల్లి మండలం గబ్బెట గ్రామానికి చెందిన గంగసాని గోపాల్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి అన్నారు. వీరి కుటుంబంలో జన్మించిన రఘుపాల్ సైతం అదే స్ఫూర్తితో కమ్యూనిస్టు ఉద్యమంలో ముందు నడిచారని ఆయన తెలిపారు. తన రచనలతో ప్రజలకు ఉత్తేజాన్నిచ్చారని పేర్కొన్నారు. సంస్మరణకు ప్రజలు అన్నివర్గాల ప్రజలు హాజరుకావాలని కోరారు.

భద్రకాళీ చెరువులో నవగ్రహ ద్వీపాలు

వరంగల్, జూన్ 8: భద్రకాళీ చెరువులో బర్డ్ సైలెన్స్ ఐలాండ్‌లను అభివృద్ధి చేస్తున్నారు. పచ్చని చెట్లు పెంచి పక్షులకు ఆవాస కేంద్రాలను తీర్చిదిద్దుతున్నారు. చెరువులో నవగ్రహ ద్వీపాల పేరుతో తొమ్మిది ఐలాండ్‌లను అభివృద్ధి చేసేందుకు కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ శ్రీకారం చుట్టింది. చెరువులోకి వివిధ జాతుల పక్షు లు వస్తుంటాయి. ప్రస్తుతం భద్రకాళీ చెరువు పూడికతీతలో భాగంగా చెరువు నీటిని బయటికి వదిలి పూర్తిగా ఖాళీ చేశారు. పూడిక మట్టిని బయటికి తరలిస్తున్నారు. కుడా ఆధ్వర్యంలో చేపట్టిన 3 లక్షల క్యూబిక్ మీటర్ల పూడికతీత మట్టిని భద్రకాళీ ఆలయ మాడ వీధుల నిర్మాణానికి వినియోగిస్తూనే, మిగతా మట్టిని చెరువులో నవగ్రహ ద్వీపాలు ఏర్పాటు చేసేందుకు వినియోగిస్తున్నారు. నవగ్రహాలకు అనుగుణంగా ఆయా గ్రహాలపై చెట్లు పెంచుతామంటున్నారు. జమ్మి, రావి, జిల్లెడు లాంటి చెట్లను పెంచనున్నారు. మొదటి నుంచి భద్రకాళీ చెరువు వద్దకు పక్షులు ఎక్కువగా వస్తుంటాయని, వాటికి అనుగుణంగా చెరువులో ద్వీపాలను అభివృద్ధి చేయనున్నారు. ఇప్పటికే చెరువు మధ్యలో పూడికతీత మట్టిని ద్వీపాల కోసం గుట్టలు గుట్టలుగా పోశారు.

ప్రమాదకరంగా పశువుల దవాఖాన

ఎప్పుడు కూలుతుందోనని సర్వత్రా ఆందోళన

శిథిలమైన స్టేషన్‌ఘన్‌పూర్‌లోని పశువుల దవాఖాన పైకప్పు

స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 8 : 'ఊడిపడిన పెంకులు.. దెబ్బతిన్న భవనం గోడలు.. ఎప్పుడు కూలిపోతుందో, ఏం జరుగుతుందో తెలియదు.. ' అని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి నిదర్శనమే స్టేషన్‌ఘన్‌పూర్‌లోని పశువుల దవాఖానను చూస్తే తెలుస్తుంది. మున్సిపల్ కార్యాలయం పక్కనే 1966లో పశువుల దవాఖాన కోసం భవనం నిర్మించారు. అప్పటి నుంచి అదే భవనంలో పశువులకు వైద్య సేవలు కొనసాగుతున్నాయి. ప్రతి రోజూ సుమారు 30 పశువుల వరకు ఇక్కడ వైద్యం అందిస్తారు. ఇక్కడ పశువులకు సంబంధించిన మందులతో పాటు, ప్రిజ్‌లో వ్యాక్సిన్ నిల్వ చేస్తారు. అయితే దవాఖాన భవనంలోని గది కూడా శిథిలావస్థకు చేరి కూలిపోయే దశకు చేరుకుంది. భారీ వర్షాలు కురిస్తే కూలిపోయేలా ఉందని రైతులతోపాటు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశువులు తమ బాధను చెప్పుకోనట్టే.. ఇందులో పనిచేసే వైద్యులు, సిబ్బంది సైతం తమ సమస్యను ఎవరికి చెప్పాలో తెలియని దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత పశువైద్యాధికారులు, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పందించి పశువుల దవాఖానను మరో భవనానికి మార్చాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనం

పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు ఘన సన్మానం

స్కూళ్ల అభివృద్ధికి పలువురి చేయూత

బచ్చన్నపేట : ఇటికాలపల్లి పాఠశాలలో పూర్వవిద్యార్థులు

రఘునాథపల్లి : రఘునాథపల్లి ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు

బచ్చన్నపేట, జూన్ 8: మండలంలోని ఇటికాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006-07 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నాడు పాఠశాలలో చదువుకున్న రోజులను గుర్తు చేసుకుని తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరినొకరి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం నాడు చదువు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధి తమవంతు సహకారం అందించాలని తీర్మానించారు.

రఘునాథపల్లిలో..

రఘునాథపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. 1986- 87 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు సమావేశం నిర్వహించి నాటి జ్ఞాపకాలను, కష్ట సుఖాలను పంచుకున్నారు. వేర్వేరు కారణాలతో మృతి చెందిన స్నేహితులకు నివాళులర్పించారు. నాడు విద్యాబోధన చేసిన గురువులను ఘనంగా సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో లింగంపల్లి సురేందర్, కరిమికొండ భాస్కర్, నగేశ్, పేర్ని వీరస్వామి, మరికూకల బాలరాజు, పెంతల ఎల్లారెడ్డి, పన్నాల వెంకటరెడ్డి, గందె రవీందర్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ : శివునిపల్లి పాఠశాలలో పూర్వ విద్యార్థులు

స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

స్టేషన్ ఘనపూర్ : మండలంలోని శివునిపల్లి జిల్లా ప్రజాపరిషత్ సెకండరీ పాఠశాలలో 2000-01 సంవత్సరంలో పదో తతరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. 25 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులు కలుసకోవడంతో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా నాడు చదువు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజ్‌మహ్మద్, సంపత్ కుమార్, రమేశ్, స్వర్ణలత, పురుషోత్తం, వాణి దేవి, శ్యామ్, విజయ్, ఇంద్రసేనారెడ్డి, గుర్రం రాజు తదితరులు పాల్గొన్నారు.

బాబుమోహన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న నరేశ్

వల్లూరి నరేశ్‌కు దళితరత్న అవార్డు

కొడకండ్ల, జూన్ 8 : మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన వల్లూరు నరేశ్‌కు దళితరత్న అవార్డు లభించింది. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్, ప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో పురస్కారాలు ప్రదానం చేశారు. తెలంగాణ ఫార్మేషన్ డే -2025 అవార్డులను సామాజిక సేవలో భాగస్వాములైన వారికి అందించారు. నటుడు బాబుమోహన్, జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్, ప్రగతి ఫౌండేషన్ అధినేత వీఆర్ శ్రీనివాస్ రాజు చేతుల మీదుగా వల్లూరు నరేశ్‌కు దళితరత్న అవార్డు అందించారు. మండలంలోని రామవరం గ్రామానికి చెందిన ఎడెల్లి భూపాల్, మచ్చ భద్రమ్మకు ఇదే కార్యక్రమంలో అవార్డులను అందజేశారు.

వాచ్యాతండాలో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

తరిగొప్పుల, జూన్ 8: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని, అందుకే తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని హెచ్ఎం మాలోత్ సరిత అన్నారు. ప్రొఫెసర్ జయంశకర్ బడిబాట కార్యక్రమం ఆదివారం మండలంలోని వాచ్యతండాలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతపై తల్లిదండ్రులకు వివరిస్తూ కరపత్రాలను పంచారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫామ్స్ ఇస్తారని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు పంపితే ఆర్థికంగా భారమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొయ్యడ రాములు, మాజీ సర్పంచ్ రవి, మాజీ ఉప సర్పంచ్ భాషా, గ్రామ కార్యదర్శి భూక్యా లింగం, భాస్కర్ పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న మార్కెట్ చైర్‌పర్సన్ లావణ్య

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 8 : మండలంలోని సముద్రాలకు 29 ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన నేపథ్యంలో ఆదివారం 25 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన స్టేషన్‌ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్య శిరీష్‌రెడ్డి భూమి పూజ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. గ్రామాల్లోని పేదలకు దశలవారీగా అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరవుతాయని ఆమె వివరించారు. సంక్షేమ పథకాల అమలులోనూ పేలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిరీష్‌రెడ్డి, ఇనుగాల వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాలయ సిబ్బందికి మూడు నెలలుగా అందని జీతాలు

గిర్మాజీపేట, జూన్ 8: కాంగ్రెస్ ప్రభుత్వం పుణ్యమా అని పస్తులంటున్నామని గ్రంథాలయ సిబ్బంది వాపోతున్నారు. మార్చి, ఏప్రిల్, మే నెల జీతాలను ప్రభుత్వం చెల్లించపోవడంతో అప్పులు చేసి కుటుంబాన్ని పోషించాల్సిన దుస్థితి దాపురించిందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఆరుగురు లైబ్రేరియన్లు, ఆరుగురు పార్ట్‌టైం వర్కర్లు, పది మంది స్వీపర్లు పని చేస్తున్నారు. మూడు నెలలుగా జీతాలు రాకపోవ